# గాంధీ అన్నయ్య

సూర్యోదయం వేళ తెల్లని నందివర్ధన పూలతో రెండు చెట్లు విరగబూసి చూడముచ్చటగా ఉండేవి.

గాంధీ అన్నయ్యకి పిల్లలు లేరు. అందుకే మేము చిన్నప్పుడు వాళ్ళింటికి వెళ్ళి పూలన్నీ కోసి, వాళ్ళ పూజకి కొన్ని ఇచ్చి గౌను నిండా పూలు పోసుకుని ఇంటికి వచ్చేవాళ్ళం నా స్నేహితురాలు నేనూను. గాంధీ అన్నయ్య మంచితనం, మాటల్లో చెప్పలేను. అంత మంచితనం. ఎలిమెంటరీ స్కూలు టీచరుగా ఉంటూ తండ్రి లేడు, తల్లి మాత్రం ఉంది. దూరపు చుట్టం ఓ ముసలమ్మ ఆమెకు ఎవరూ దిక్కు లేరు అందుకు ఇక్కడే ఉంటుంది. అతని పేదరికాన్ని వెక్కిరిస్తూ ఒక పూరిల్లు - పొట్ట చింపినా అక్షరం ముక్క రాని భార్య.

గాంధీ అన్నయ్య తెల్లని పంచి కట్టుకుని తెల్లని లాల్చీ వేసుకునేవాడు, అతని రంగులాగే. చిన్నప్పుడు వాళ్ళ అమ్మ దువ్విన పక్క పాపిడి, పట్టుమని పాతికేళ్ళు లేని గాంధీ అన్నయ్య వేదాంతిలా నిర్లిప్తంగా, నవ్వుతూ పాఠాలు చెప్పేవాడు.

నాకు గాంధీ అన్నయ్య అంటే ఎందుకో మనసంతా జాలితో నిండిపోయేది. అతనికి ఏదో అన్యాయం జరుగుతోందని అనిపించేది.

పలకా పుస్తకాలూ ఇంట్లో పెట్టి సాయంకాలం నా ఫ్రెండ్సుతో ఆడుకునేందుకు వెళ్ళేదాన్ని. పట్టుమని ఎనిమిదేళ్ళు లేని నేను గాంధీ అన్నయ్య ఇంటి దగ్గర ఆడుకుంటూంటే ఇంట్లోంచి పెద్ద కేకలు వినిపించాయి. గాంధీ అన్నయ్య ఇంటి తలుపులు తీసే ఉన్నాయి. గుమ్మంలో నుంచుని ఏమిటా కేకలు అని వినసాగాను. గాంధీ అన్నయ్య దిగులుగా కూచుని ఉన్నాడు.

అతని తల్లి, వాళ్ళింట్లో ఉన్న ముసలమ్మా, చెరొకమూలన కూర్చుని ఏడుస్తూ కూచున్నారు.

గాంధీ అన్నయ్య భార్య సరోజ మాత్రం తెలుగు సినిమా హీరోయిన్‌లాగా చేతులతో ఏక్షన్ చేస్తూ మాట్లాడుతోంది.

"నాకు పిల్లలు లేకపోయినా, ఈ ముసలమ్మల సేవకోసం పుట్టాను. నా ఖర్మ ఈ పూరిల్లూ సుద్ద మొద్దు అవతారం మొగుడూ. నా కోరికలు తీరేదేముంది? ఇంట్లో

చాకిరీ చేయలేక చస్తున్నాను. నా పుట్టింటికి పోతాను. నేనుండలేను. ఈ కాపురం నాకు వద్దు"అని అరిచింది.
గాంధీ అన్నయ్య భార్య సరోజ గెడ్డం పట్టుకుని, "అలా అరవకే అంతా వింటారు. పోనీ నువ్వు చెయ్యలేకపోతే పెందరాళే లేచి అన్నం వండి మరీ స్కూలుకి వెడతానే" అని బతిమాలుతున్నాడు.
" నేను పుట్టింటికి పోతాను. ఇప్పుడే పోతాను" అంటూ, తాడుమీద ఆరేసిన చీరా జాకెట్టు లాగి ఒక సంచిలో పెట్టింది. విస విసా వీధిలోకి వచ్చింది.
గాంధీ అన్నయ్య చెప్పులు తొడుక్కుని, "పద బస్సు ఎక్కిస్తాను" అన్నాడు.
అక్కడికి వెళితే నెలరోజులు తిండిపెట్టే స్థితిలో లేడు తండ్రి. అదీ తెలుసు. దాంతో తారాజువ్వలా లేచి వీధిలోంచి వెనక్కి వచ్చి "వెళ్ళవద్దని బతిమాలుతారు అనుకున్నాను" అని భోరున ఏడ్చేసింది. ఇల్లంతా నానా రభస చేసింది. జుట్టు పీక్కుంది.
"నీతో ఏమాటన్నా తప్పేనే, వెళ్ళవద్దంటే బాధపడతావని, ఇలా అన్నాను" అన్నాడు వినయపూర్వకమైన అపాలజీ ఇస్తూ.
"నీ కోసం పెళ్ళి చేసుకు వచ్చాను కాని, ఈ ముసలి పీనుగులకి వండి పెట్టడానికి నీ వాకిలి చిమ్మి ముగ్గు వెయ్యడానికి కాదు" అంది కళ్ళు ఎర్రజేస్తూ.
"వృద్ధులకి సేవ చేస్తే భగవంతుడు మెచ్చుతాడే మనం చల్లగా ఉన్నామంటే ఈ పెద్దలు కారణమే.ఆ దేవుడు మెచ్చుకుంటాడే. అప్పుడు మన కడుపు పండి పిల్లలు పుడతారు?" అని చెంపలు నిమిరి భార్య కళ్ళు తుడిచి దగ్గరగా తీసుకోబోయాడు.
ఆమడ దూరానికి తోసేసింది. మిమ్మల్ని చూసినా మీమాట విన్నా నా ఒళ్ళు రవరవలాడిపోతుంది. ఇది అంతా నా ఖర్మ."
' మీ అమ్మనాన్న నా కోసం నిన్ను కన్నారే. పోనీ గొప్ప ఉద్యోస్తుణ్ణి చూసి చేసుకోకపోయావా?" అన్నాడు.
"నా పుట్టింటి వారూ పూరిల్లు ఉన్నవారే కదా? అందుకే ఈ పూరింటికి ముసలమ్మలకీ ఈ బుద్ధావతారం మొగుడికి ఇచ్చి పెళ్ళి చేసారు" అంది.
ఇది అంతా విన్న నా మనసులో ఏదో భీతి బాధ ఆవరించుకున్నాయి. పరిగెట్టుకుని మా ఇంటికి వచ్చేసాను. అమ్మ రామకోటి రాస్తోంది. నాన్నగారు అరుగు మీద స్నేహితులతో కబుర్లు చెపుతున్నారు. మధ్య మధ్య నాన్నగారి మాటలకు అందరూ

సంతోషంగా నవ్వుతున్నారు.

హమ్మయ్య గాంధీ అన్నయ్య ఇల్లు కాదుకదా! బాధ కొంచెం తగ్గింది. అయినా మనసు ఆగక అమ్మకి నేవిన్నదంతా చెప్పేసాను. "వాళ్ళింటికి ఎందుకు వెళ్ళావే ఆడుకునేందుకు పిల్లలున్న చోటికి వెళ్ళక!" అంది. నన్ను చూసి జాలిగా, మా అమ్మ.

"అయితే గాంధీ అన్నయ్యకి పిల్లలు లేరా? ఇంక పుట్టరా?" అని దిగులుగా అడిగాను, అమ్మ కళ్ళలోకి చూస్తూను.

"నీ కెందుకే చిన్న పిల్లవి. పుడతారో లేదో ఆ భగవంతుడికి తెలియాలి. ఇంకెప్పుడూ వాళ్ళింటికి వెళ్ళకు" అంది.

"మరి పువ్వులు కోసుకుందుకు?" అన్నాను.

"మన పెరట్లో పూలు చాలు, దేవుడికి. ఆ పిల్లాపాపలేని వాళ్ళింట్లో పూలు మనకొద్దు" అంది కోపంగాను.

"మరి గాంధీ అన్నయ్య పిల్లలందరికీ చదువు చెపుతాడు కదా? అతని దగ్గిర చదువుకోవచ్చా! అతని తప్పేముంది పిల్లలు ఇవ్వని ఆ దేవుడు తప్పుకాని" అన్నాను.

"నీకెందుకు వెళ్ళు. దేవాలయానికి వెళ్ళే వేళైంది."

"అయితే గుడికి వెళ్ళి గాంధీ అన్నయ్యకి పిల్లలనియ్యి దేవుడూ అని, అడుగుతాను" అన్నాను. అమ్మ నన్ను ముద్దు పెట్టుకుని "ఆ దేవుడు నిన్ను చల్లగా చూడాలి. ఏవన్నా అంతా నావాళ్ళే అనుకుని ఆలోచిస్తావు" అంది అమ్మ.

జీవితంలో కొందర్ని చూస్తే ఎన్నేళ్ళయినా మరిచిపోలేం. వాళ్ళ వ్యక్తిత్వం అటువంటిది. రకరకాల లోహాలు ఉన్నట్టే మనుషులూను, మెత్తని బంగారం లాంటి మనసు గాంధీ అన్నయ్యది. కాని, అతని భార్య సహజ ఇనుము, ముసలమ్మలు ఇద్దరూ, రాగి, కంచు లాంటివారు. ఈ మట్టిలో అన్ని లోహాలూ దొరికినట్లే మనుషుల్లోనూ ఉంటారు. మట్టి మనుషులు మాత్రం చాలామంది ఉంటారు.

ఇలా ఆలోచిస్తూనే పెద్దదాన్నై, పెళ్ళై అత్తవారింటికి వచ్చేసాను. కాని, సొంత ఊరువారు అంతరంగాన ఉందురని సామెతగా, అందరూ జ్ఞాపకం వస్తూనే ఉంటారు. మనుషులు దూరంగా ఉన్నా మనసు మాత్రం వాళ్ళ మధ్యనే తిరుగుతుంది.

ఆ తర్వాత నాన్నగారికి ఆ ఊరునుంచి ట్రాన్స్ఫరు అయిపోయింది. నాకేం నేను బాగానే ఉన్నాను. అత్తవారింట్లో అందరూ చెప్పినట్లూ వినేదాన్ని. అప్పుడు వాళ్ళూ నే

చెప్పినట్లు వినేవారు. నాకు అత్తగారూ, మావగారూ, ఆడబడుచులూ, మరుదులూ, ముందు ముఖ్యంగా నా భర్త, ఆ ఇల్లు ఒక కోవెలగా ఉండేది. ఈ హడావిడిలో, పెళ్ళిళ్ళు పేరంటాలూ అంటూ ఇరవై ఏళ్ళు ఇట్టే గడిచిపోయాయి.

పిల్లలూ, పెళ్ళి సంబంధాలూ మాట్లాడుకోవడంతో గాంధీ అన్నయ్య మా చిన్నప్పటి ఊరూ, కబుర్లూ వచ్చాయి. అవే మాటలు మాకు తెలుసున్న స్నేహితురాలితో అన్నాను ఒక రోజున మధ్యాహ్నపు కబుర్లలో.

అంతావిని, ఆమె పక పకా నవ్వింది.

"ఏమిటలా నవ్వుతారు?" అని ఆసక్తిగా అడిగాను.

"బలేవారే ఆ గాంధీ ఎవరనుకున్నారు? మా చెల్లెలు మొగుడు" అంది ఆమె.

"నిజంగానేనా ఏమిటి? మళ్ళీ చెప్పండి" అన్నాను.

"నేను సరిగా చెపుతున్నాను మీరు వినండి" అంది."ఆ గాంధీ గారికి ఇప్పుడు ఇద్దరు పిల్లలు" అంది.

"అదెలాగ వాళ్ళకి పిల్లలు లేరుగా!" అన్నాను, ఆశ్చర్యపోతూను.

"అసలు వాళ్ళింట్లో ఇద్దరు ముసలివాళ్ళు ఉండాలి ఉన్నారా?" అన్నాను.

"అసలు ఏం జరిగిందంటే, ముసలమ్మలు, ఇద్దరూ, కాలక్రమేణా వెళ్ళిపోయారు. ఆ తర్వాత సరోజకి కాన్పువచ్చి కాన్పులోనే పోయింది. అతను ఒంటరిగా ఒండుకు తింటూంటే, నలుగురూ, మళ్ళీ పెళ్ళి చేసుకోవయ్యా గాంధీ అంటే నా మనసు బాగోలేదు. ఏం మాట్లాడొద్దు అనేవాడు. ఆ ఊర్లో ఒక పెద్ద కామందు ఇంట్లో పెళ్లయింది. ఆ రాత్రి పెళ్ళి ఊరేగింపులో బాణసంచా కాల్చారు. అందులో ఒక తారా జువ్వ వెళ్ళి ఆ పూరింటిమీద పడింది. ఇల్లు అంటుకుని మంటలు వస్తూంటే గాంధీ పరిగెట్టుకుని ఇవతలికి వచ్చేసాడు. ఎదురింట్లో ఉన్న మా అన్నయ్య వదినా తీసికెళ్ళి ఆదరించి ధైర్యం చెప్పారుట, అక్కడే భోజనం చేసి రాత్రిళ్ళు వెళ్ళి రామాలయం అరుగుమీద పడుకునేవాడట. ఓ రోజున మా అన్నయ్య వదినా కోప్పడి వాళ్ళింట్లోనే చోటిచ్చారుట. ఊరంతా వెళ్ళి 'వాళ్ళ పూరిల్లు మీ వల్ల కాలిపోయింది. మీ పెళ్ళి మూలానే కదా? అందుకనే నష్టపరిహారం ఇవ్వండి' అని గొడవ చేసారుట. దాంతో డబ్బున్న కామందు కదా.

'పోనీ, రెండు డాబా గదులు కట్టించి ఇస్తాను.' అని మంచి తనంతో అన్నాడు.

గాంధీ ఊర్లో టీచరుగా ఉండటంతో అంతా సహాయంచేసి కట్టించారుట.
కొత్త ఇల్లు గృహ ప్రవేశం అవ్వాలి కదా? మరి పెళ్ళి చేసుకో అని స్నేహితులు సలహా ఇచ్చారు.
మా అన్నయ్య అవకాశం కోసం, ఎలా అడగనా, అని ఎదురుచూస్తున్నాడుట, ఓ రోజున స్నేహితులచేత అడిగించాడు. గాంధీ కాదనలేక అవుననలేక మౌనంగా ఉన్నాడుట. దాంతో సందుదొరికింది కదా అని మా చెల్లెలిని చూపించి, గాంధీనీ మా చెల్లెలునీ వప్పించి పెళ్ళి చేసారు. ఇప్పుడు ఇద్దరు ఆడ పిల్లలు. పెద్ద పిల్లకి పెళ్ళైయింది. రెండో ఆడ పిల్ల పెళ్ళికి ఉంది" అంది ఆమె.
అంతా విన్న నాకు ఆనందం అవధులు దాటింది. దేవుడు ఉన్నాడు గాంధీ అన్నయ్యకి పిల్లలు పుట్టారు. అని మనసు సంతృప్తి పడింది. ఎవరేనా బాగున్నారంటే మనసు సంతోషపడుతుంది. బాధ పడుతున్నారంటే మనకి దిగులు కలుగుతుంది. ఇదే మానవ నైజం కదామరి.
ఆ తర్వాత మారెండోవాడు స్నేహితుడి పెళ్ళి అని వెళ్ళాడు. రెండు రోజులకి వచ్చాడు.
"నిన్ననే వస్తానన్నావు నీ కోసం రాత్రి పొద్దుపోయే దాకా లైట్లు వేసుకుని కూచున్నాను. అయినా ప్రయాణాలు అంటే సరదా పోయింది. ఏం జరుగుతుందో అనే భయమేను" అన్నాను.
పక పక నవ్వి "అమ్మా నీకు ముసలితనం వచ్చేసిందే" అన్నాడు రాజు.
"అవును అలాగే నవ్వుతాలుగానే ఉంటుంది. నీకు పిల్లలు పుట్టాక తెలుస్తుంది" అన్నాను.
"అమ్మా అన్నట్లు నీకో సంగతి చెప్పనా? కోప్పడవుకదా?" అన్నాడు రాజు.
"చెప్పరా, నా దగ్గిర భయం ఎందుకు?" అన్నాను.
మెల్లగా, "అమ్మా చిలక, రామచిలక" అన్నాడు రాజు.
"చిలక ఏమిట్రా?" అన్నాను.
"మా ఫ్రెండు పెళ్ళిలో ఓ చిలకని చూసాను. చాలా బాగుందమ్మా. నువ్వు ఊ అంటే, నాన్నగారిదేముంది? మీ తల్లీ కొడుకుల ఇష్టం అంటారు" అన్నాడు రాజు సంతోషంతో.
"ఆ... ఆ... ఇదా పెళ్ళికి వెళ్ళి చేసుకొచ్చిన గొప్ప సంగతి, అసలు పేరేమిటో అడిగావా?"
"ఓ అడిగాను, స్వర్ణ " అన్నాడు సంతోషంతో కళ్ళు మెరిసిపోతూ.
"ఎవరు ఏమిటి? తండ్రి ఎవరు? ఏ ఊరు?" అన్నాను.

"గాంధీ అని చెప్పింది. చిన్న బోర్డు స్కూల్లో టీచరుట" అన్నాడు రాజు జాలిపడుతూను.

"ఏ ఊరు?" అన్నాను."రావూరు" అన్నాడు.

"ఆ.." అన్నాను ఆవేశంతోను. "ఆ... చెప్పిన ఊరు అదే -నా చిన్నప్పటి ఊరు. అయితే మా గాంధీ అన్నయ్య కూతురేను" అన్నాను.

"అదేమిటి? నువ్వు ఎలా ఎరుగుదువు?" అన్నాడు రాజు.

"సరే ఆ వివరాలన్నీ నేను తెలుసుకుంటానులే" అన్నాను.

అంతే నేను అనుకున్నదే నిజమైంది. గాంధీ అన్నయ్య కూతురేను. ఇంక ఆలస్యం దేనికి అని వాళ్ళకి కబురు పెట్టి రప్పించి మాట్లాడాను.

గాంధీ అన్నయ్య ఆనందంతో "చిన్నప్పుడు నా దగ్గిర చదువుకున్న సీతవే నువ్వు! నా కూతుర్ని నీ కొడుక్కి ఇవ్వడం అంటే, పాల కడలిలో కాపురంలాంటిదేను, నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు. మళ్ళీ ఇంత అందంగా గాంధీ అన్నయ్యతో వియ్యమందడం స్వర్ణలాంటి కోడలు రావడం నిజంగా ఏ కథలూ, గాధలూ చాలవు. నిజ జీవితంలోనే కధ అలాంటిది. గాంధీ అన్నయ్యకి పిల్లలు లేరు అనుకునేదాన్ని ఇలా కూతురు పుట్టి నా ఇంటిని మెట్టిందంటే కధగానే ఉంటుంది మీకూను.

❄❄❄

(అముద్రితం 2004)